ప్రజాశక్తి
బుధవారం 31 జనవరి 2024
5
కర్నూలు





లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సృజన, నాయకులు

రైల్వే లైన్ల నిర్మాణం, కొత్త రైళ్ల కోసం

నిధులు కేటాయించాలి

- రైల్వేస్టేషన్ ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్

కర్నూలు జిల్లాలో కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి, కర్నూలు జిల్లా కేంద్రం నుండి అదనపు రైళ్ల ఏర్పాటుకు 2024-25 సంవత్సరపు బడ్జెట్లో నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి నిర్మల కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాకు అదనపు రైళ్ల కోసం, కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ ముందు ధర్నాచేశారు. సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ కర్నూలు నగరం ఆంధ్ర రాష్ట్రానికి తొలి రాజధాని అయినప్పటికీ నేటికీ నగరం నుండి వివిధ ప్రాంతాలకు రైళ్ల సౌకర్యాలు లేవన్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు నగర ప్రజలు రెగ్యులర్ గా రాజధానికి వెళ్లడానికి రైల్లు లేకపోతే సిపిఎం ఇతర పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేయడం వల్ల కర్నూలు నుండి హైదరాబాద్‌కు ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర విడిపోయిన తర్వాత అమరావతి రాజధానికి వెళ్లడానికి ఎటువంటి సౌకర్యం లేదని తెలిపారు. ఆంధ్ర రాష్ట్రం విడిపోయి పది సంవత్సరాలు అయినప్పటికీ నేటికీ కూడా ఒక్క రైలు కూడా కర్నూలు నుండి విజయవాడకు లేకపోవడం నగర ప్రజల దౌర్భాగ్యమన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వం, నేడున్న ప్రభుత్వం , ఎంపీలు రైలు వేయించడానికి ప్రయత్నం చేయకపోవడం, ప్రజాప్రతినిధుల చేతకానితనానికి నిదర్శనమని ఘాటుగా విమర్శించారు. బిజెపి కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ కర్నూలు జిల్లా నుండి వివిధ ప్రాంతాలకు రైళ్లు వేయించకపోవడం కర్నూలు జిల్లా ప్రజల పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధి స్పష్టమవుతున్నదన్నారు. గతంలో ఉన్న మచిలీపట్నం ట్రైన్ కూడా రద్దు చేసినా అడిగే నాథుడే లేడన్నారు. కాచిగూడ-గుంటూరు రైలును విజయవాడ వరకు పొడిగించలేకపోవడం రైల్వే అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. పంచలింగాల దగ్గర రైల్వే వ్యాగన్ వర్క్ షాప్ నిర్మాణం నత్తనడకగా సాగుతున్నదని, త్వరితగతిన పూర్తి చేయడానికి ఈ బడ్జెట్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విజయవాడ, విశాఖపట్నం, కాకినాడకు రెగ్యులర్ గా ట్రె న్లు నడపాలని, కర్నూలు విజయవాడ మధ్య ఇంటర్సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును ఏర్పాటు చేయాలని, రద్దు చేసిన మచిలీపట్నం మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరించి రోజువారీగా నడపాలని, కర్నూలు నుండి హైదరాబాద్ మీదుగా విశాఖపట్నంకు వెళ్లే రైలును రెగ్యులర్ ట్రెన్‌గా మార్చాలని, కర్నూలు నుండి బాంబేకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేయాలని, ప్రతి రైలులో 6 జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలన్నారు. కర్నూలు నుండి మంత్రాలయం, కర్నూలు నుండి శ్రీశైలం, కర్నూలు నుండి ఓర్వకల్ మీదుగా నంద్యాల వరకు కొత్త రైల్వే లైన్ల నిధులు కేటాయించాలన్నారు. జర్నలిస్టులకు, సీనియర్ సిటిజన్‌లకు, విద్యార్థులకు, వికలాంగులకు, రద్దు చేసినరాయితీలను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం స్టేషన్ మేనేజర్ కు వినతి పత్రాన్ని ఇచ్చారు. సిపిఎం జిల్లా నాయకులు రాధాకృష్ణ, నారాయణ, రాముడు, నగేష్, నగర నాయకులు నరసింహులు, ప్రభాకర్, అబ్దుల్లా, రామకృష్ణ పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

8న కర్నూలులో బాలోత్సవం

- లోగోను ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వచ్చేనెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న కర్నూలు బాలోత్సవం లోగోను మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో నంది అవార్డు గ్రహీత బాల ఉత్సవం కమిటీ ఉపాధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్యదర్శి జెఎన్.శేషయ్య, ప్రైవేట్ విద్యాసంస్థల అసోసియేషన్ జిల్లా గౌరవ సలహాదారుడు పిబివి సుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు వాసు దేవయ్య, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఎంపి.బసవరాజు, సోషల్ మీడియా విభాగం కన్వీనర్ ఎల్లాగువేరా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు, నాయకులు అనిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు నగర శివారులోని ఇండస్ మాంటిస్సోరి పాఠశాలలో ఫిబ్రవరి 8, 9 తేదీల్లో బాలోత్సవం పండుగను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని వారు కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

వర్సిటీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని రాయలసీమ వర్సిటీ వైస్ ఛాన్సలర్ సుధీర్ ప్రేమ్ కుమార్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను విన్నవించారు. కర్నూలు కార్పొరేషన్ నుండి వర్సిటీకి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు జిల్లా కలెక్టర్ కూడా కానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

పైప్ లైన్ నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్

ముచ్చుమర్రి నుండి ఓర్వకల్లు మెగా పారిశ్రామిక హబ్ నీటి సరఫరా కోసం ఎన్‌హెచ్340 సి వెంట పైప్ లైన్ నిర్మాణానికి కావాల్సిన అనుమతులకు మంగళవారం గార్గేయపురం వద్ద జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ముచ్చుమర్రి నుండి ఓర్వకల్లు మెగా పారిశ్రామిక హబ్ నీటి సరఫరా పైప్ లైన్ వేస్తున్నామన్నారు. నందికొట్కూరు నుండి గార్గేయపురం వరకు వేయాల్సిన పైప్ లైన్‌కు సంబంధించి ఎన్‌హెచ్ 340సి వారు అనుమతులు ఇవ్వాల్సి ఉండగా అందుకు సంబందించిన నివేదికలను పరిశీలించి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి అనుమతులు వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కలెక్టర్ వెంట పారిశ్రామిక శాఖ జోనల్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి, కర్నూలు ఆర్‌డిఒ హరిప్రసాద్ , నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ గోవర్ధన్, పాల్గొన్నారు.

పాములు, దోమల నుంచి రక్షించండి

- ఆఫీసు చుట్టూ తిరిగి అలిసిపోయాం
- కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కాలనీ వాసుల ధర్నా

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

ఆఫీసుట్టు తిరిగి తిరిగి అలిసిపోయామని, పాములు, దోమల భారీ నుండి రక్షించాలంటూ పెద్దపాడు రోడ్డు సమీపంలో ఉన్న శ్రీ లక్ష్మీ విలాస్ కాలనీ ప్రజలు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. మా కాలనీ ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎస్ఎల్‌వి కాలనీ ప్రజలకు మద్దతుగా పాల్గొన్న పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి మాట్లాడుతూ వీధిలో కొంతమందికి మాత్రమే నీళ్లు వస్తున్నాయని, ఉన్న లైట్లు వెలగవని, రోడ్లు కాలువల లాంటి అభివృద్ధి పనులు ఏ ఒక్కటి చేపట్టలేదన్నారు. ఒక బాలిక పాముకాటుకు గురైందని అధికారుల దృష్టికి తెచ్చినా... ఇంతవరకు వీధిలైట్ల సమస్యపై సంబంధిత అధికారులు స్పందించలేదని విమర్శించారు. ఈ ధర్నా కార్యక్రమానికి పిపిఎస్ఎస్ నగర నాయకులు ఎ.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. శ్రీ లక్ష్మీ విలాస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎన్. రామన్న, ఎస్ఎండి షరీఫ్, జిటి. నారాయణ, శ్యామల మాట్లాడుతూ అందరితోపాటు మేము. ఇంటి పన్నులు చెల్లిస్తున్నాం! కానీ మా కాలనీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు చేపట్టి పాములు, దోమల నుండి రక్షణ కల్పించాలని కోరారు. అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ మాట్లాడుతూ కమిషనర్‌తో చర్చించి కాలనీలో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో కాలనీ ప్రజలతోపాటు పిపిఎస్ఎస్ నగర నాయకులు సివి .వర్మ, ఎస్.రమణ గౌడ్, ఎన్. శ్రీనివాసరెడ్డి కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎసిబి వలలో విఆర్ఒ

- వలపన్ని పట్టుకున్న అధికారులు
- రూ.10 వేలు లంచం తీసుకుంటూ చిక్కిన హెచ్.కైరవాడి విఆర్ఒ రామకృష్ణ

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని హెచ్.కైరవాడి గ్రామంలో విఆర్ఒగా పనిచేస్తున్న బోయ తలారి రామకృష్ణ రైతుల నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు మంగళవారం వల పన్ని పట్టుకున్నారు. ఆయనతోపాటు రైతులతో మధ్యవర్తిగా మాట్లాడి డబ్బులు తీసుకునేందుకు సహకరించిన విఆర్ఎ కుమారుడు మల్లేష్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. కర్నూలు జిల్లా ఎసిబి డీఎస్పీ వెంకటాద్రి వివరాల మేరకు... హెచ్.కైరవాడి గ్రామానికి చెందిన నల్లబోతుల రంగస్వామి, బోయ హనుమంతు ఐదుగురు అన్నదమ్ములు. వారు తమ తండ్రి నుంచి సంక్రమించిన 9.45 ఎకరాల భూమిని పంపకాలు చేసుకున్నారు. ఆ భూమిని ఆన్‌లైన్ చేసి ఈ-పాస్ పుస్తకం మంజూరు చేసేందుకు విఆర్ఒ రామకృష్ణను సంప్రదించారు. ఆయన గ్రామ రెవెన్యూ సహాయకుడు దాసన్న కుమారుడు బోయ తలారి మల్లేష్ ద్వారా ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున డిమాండ్ చేశారు. చివరికి ఒకరి నుంచి రూ.2 వేల చొప్పున ఐదుగురికి రూ.10 వేలు చెల్లించేలా ఒప్పుకున్నారు. డబ్బు చెల్లించడం ఇష్టం లేని బోయ హనుమంతు ఎసిబి అధికారులను సంప్రదించారు. మంగళవారం సాయంత్రం సుమారు 5.30 గంటల సమయంలో బోయ తలారి మల్లేష్ ద్వారా బోయ హనుమంతు ఇచ్చిన రూ.10 వేలను విఆర్ఒ రామకృష్ణ లంచం తీసుకుంటుండగా వలపన్ని పట్టుకున్నారు. కెమికల్ టెస్ట్ కూడా చేశామని డీఎస్పీ తెలిపారు. వారి దగ్గర రూ.10 వేలే కాకుండా అదనంగా విఆర్ఒ రామకృష్ణ దగ్గర రూ.8,750, బోయ తలారి మల్లేష్ దగ్గర రూ.26,430 లెక్కతేలని నగదును కూడా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఎసిబి సిఐ తేజేశ్వరరావు, కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఎసిబి అధికారులకు చిక్కిన రామకృష్ణ

విద్యుత్తు స్తంభాల వల్ల నష్టపోయిన

రైతులకు పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి -కోడుమూరు

న్యాయమైన పరిహారం ఇచ్చేంతవరకు రైతుల రైతుల పొలాలో విద్యుత్ స్తంబాలు పాతే పనులను నిలిపి వేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. కోడుమూరు మండలం కలపర్రి, పులకుర్తి, వలకూరు గ్రామాలలో పాతుతున్న కరెంటు స్తంభాల వల్ల నష్టపోయిన భూములను జి.రామకృష్ణ, కోడుమూరు మండలం కార్యదర్శి ఆర్.మనోహర్‌తో కలిసి పరిశీలించారు. పల్లెరఘునాథ్‌రెడ్డి, ఆర్.మనోహర్, యోహాను, లింగారెడ్డి తదితరరైతుల భూములలో విద్యుత్తు స్తంభాలు రావడం వలన శాశ్వతంగా భూముల విలువ కోల్పోతున్నారని, అటువంటి వారికి తగిన న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాల్సి ఉండగా నోరులేని రైతులను అదిరించి బెదిరించి నామ మాత్రమైననష్టపరిహారం ఇచ్చారన్నారు. కర్నూలు జిల్లాలో ఇప్పటికే అనేక చోట్ల తుగ్గలి, కల్లూరు, వెల్దుర్తి, పత్తికొండ, దేవనకొండ ,కోడుమూరు తదితర మండలాల్లో ప్రభుత్వ , ప్రైవేటు కంపెనీ వాళ్ళు విద్యుత్ స్తంభాలు నాటే ప్రక్రియను చేస్తున్నారన్నారు. కొన్ని ప్రాంతాలలో రైతులకు కనీసమైన పరిహారం కూడా చెల్లించడం లేదన్నారు. ఇది సరైన పద్ధతి కాదని, రైతులకు అనేక రకాల చట్టాలు ఉన్నప్పటికీ అవి సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. తుంగలో తొక్కి ప్రైవేటు కంపెనీకి అనుకూలంగా వాటిని మార్చుకొని రైతుల నోట్లో మట్టి కొడుతున్నారన్నారు. కొన్నిచోట్ల రైతులు ఐక్యమై నిలబడిన చోట మంచి పరిహారం సాధించుకుంటున్నారని అన్నారు. వ్యవసాయం సరిగా లేక అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్న రైతాంగానికి రకరకాల పేర్లతో రైతుల భూములను స్వాధీనం చేసుకోవడం తగిన నష్టపరిహారం ఇవ్వకపోవడం వల్ల తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారన్నారు. రైతులపై కనికరం లేకుండా పంట పొలాలలో ప్రవేశించి పంటలను నాశనం చేసి విండో సోలార్ వాటి వల్ల ఉత్పత్తి అయిన కరెంటును అమ్ముకోవడానికి వాళ్ల లాభాల పంటలు పండించుకోవడానికి రైతుల పొలాలు ఉచితంగా కావాలా ఇదెక్కడి న్యాయమని రైతులు ప్రశ్నిస్తున్నారన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని కల్లపర్రి, పులకుర్తి, వల్కూరు గ్రామాలలో నష్టపోయిన రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పించాలన్నారు. లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళన చేపడతామని ,విద్యుత్తు స్తంభాలు వేసే ప్రక్రియను ప్రతిఘటిస్తామని రామకృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మద్దిలేటి, చిన్న పెద్దయ్య, పౌలయ్య పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న రామకృష్ణ




డిసిసి కార్యాలయంలో గాంధీజీకి నివాళ్లు అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి డిసిసి అధ్యక్షుడు కె.బాబురావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గాంధీజీ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉండవెల్లి వెంకటన్న, పిసిసి ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, డిసిసి ఉపాధ్యక్షులు బి.బతుకన్న, డిసిసి ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ గుప్త, ఎన్.చంద్రశేఖర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎస్. ప్రమీల, సిటీ మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ లు పాల్గొన్నారు.



మైపర్‌లో ఘనంగా గాంధీ వర్ధంతి

కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు మైపర్ ఫార్మసీ కళాశాలలో గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటాన్ని పూలమాలతో అలంకరించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన గొప్పతనాన్ని , గాంధీజీ స్వాతంత్రం కోసం పోరాడిన తీరును విద్యార్థులకు తెలిపారు. ఈ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవి కుమార్ రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కాసర్ల సురేష్ ,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా క్రాంతి నాయుడు

ప్రజాశక్తి-పత్తికొండ : కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేయ దలచిన వారు అప్లికేషన్ దాఖలు చేయమని పార్టీ హై కమాండ్ కోరిన విషయం విధితమే. బుధవారం కర్నూలు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం అంధ్రరత్న భవన్ లో పత్తికొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా క్రాంతి నాయుడు , కర్నూలు పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విక్రమ్ నాయుడు అప్లికేషన్ దాఖలు చేశారు. త్వరలో స్క్రీనింగ్ కమిటీ సమావేశం లో తుది జాబితా విడుదల చేస్తామని అప్లికేషన్ కమిటీ వారు తెలిపారు.

బడుగులను బకరాలను చేసిన జగన్

టిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు బిటి నాయుడు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని బిసి, ఎస్‌సి, ఎస్‌టి ,మైనార్టీ సామాజిక వర్గాల వారిని ఎన్నికలకు ముందు నమ్మించి లబ్ధిపొందిన తర్వాత వారిని టార్గెట్‌గా పెట్టుకొని బకరాలను చేస్తున్నారని టిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బిటి.నాయుడు ఆరోపించారు. మంగళవారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో కోడుమూరు ఇన్చార్జి ఆకెపోగు ప్రభాకర్, లీగల్ సెల్ అధ్యక్షులు కెయి. జగదీష్, టిఎన్‌టియుసి నాయకులు అశోక్ కుమార్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరామ్ గతంలో టిడిపిలో ఉన్న సమయంలో జడ్‌పిటిసి సభ్యునిగా మంచి పేరు గడించారన్నారు. ఎలాంటి ఆరోపణలు, అవినీతి అక్రమాలకు పాల్పడకుండా పనిచేశారన్నారు. ఆయన టిడిపిని వీడి వైసిపి లో చేరాక జగన్ సూచనల మేరకు పనిచేస్తూన్నందున వారి ఆలో చనా విధానంలో మార్పువచ్చిందన్నారు. జగన్‌కు తన అవినీతిలో వాటా ముట్ట జెప్పనందుకే దూరంగా పెట్టారని అన్నారు. గతంలో బెంగళూరుకు చెందిన ఇతినా సంస్థ ఆస్పరి ప్రాంతంలో పరిశ్రమను నెలకొల్పేందుకు 2006లో రూ.52 వేలకు ఎకరా ప్రకారం 443 ఎకరాలు కొనుగోలు చేసిందని, ఎంతో మంది ఎస్‌సి, బిసి పేద బడుగు వర్గాల వారు భూములిస్తే తమ కుటుంబాల వారికి ఉద్యోగవకాశాలు వస్తాయని దారదత్తం చేస్తే అక్కడ ఎలాంటి పరిశ్రమలు నెలకొల్పకపోగా కనీసం పునాదిరాయి కూడా వేయలేదన్నారు. అ భూములలో కొంత మంత్రిగా ఉన్న జయరామ్ కేవలం 1.72 వేలకు ఎకరా చొప్పున కొనుగోలు చేసి భూములిచ్చిన వారికి అన్యాయం చేసి కోట్లాది రూపాయలు లబ్ధిపొందా రన్నారు. ఇదంతా ముఖ్యమంత్రి అదేశాల మేరకే జరిగిందన్నారు. వారికి జయరామ్ వాట ఇవ్వక పోవడం వల్లనే ఈ రోజు వారిని పక్కన పెట్టారన్నారు.ఇప్పటికైనా మంత్రి జయరామ్ గతంలో మీ ముఖ్యమంత్రి ఏమి ఒప్పందం చేసుకున్నారో మీ అవినీతి భాగోతానికి కారణాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ విషయమై రాష్ట్ర తెలుగుదేశంపార్టీ త్రీమెన్ కూడా పరిశీలనచేసి నిజాలు బయట పెట్టిందన్నారు. అప్పట్లో మంత్రి జయరామ్ ముఖ్యమంత్రి రాముడు,దేవుడు అంటూ గొప్పలు చెప్పారన్నారు. ప్రస్తుతం నిన్ను బజారుకీడ్చారుకనుక ఇప్పటికైనా అప్పట్లో జరిగిన అంశాలను బయటపెట్టాలని సూచించారు.



మాట్లాడుతున్న బిటి నాయుడు

నూతన న్యాయమూర్తులకు ఐలు సన్మానం

ప్రజాశక్తి -కర్నూలు లీగల్

కర్నూలు బార్ అసోసియేషన్‌కు చెందిన ఇద్దరు మహిళా న్యాయవాదులు బి. జస్వంతి యాదవ్ , కుమారి శివనవ్రత హైకోర్టు నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి రాత పరీక్షల్లో విజయం సాధించి జూనియర్ సివిల్ జడ్జీలుగా ఎంపి కయ్యారు. కర్నూలు ఐలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కర్నూలు బార్ అసోసియేషన్‌లో సన్మానించారు. ఐలు రాష్ట్ర అధ్యక్షులు కెంగర కుమార్ మాట్లాడుతూ కర్నూలు బార్ అసోసియేషన్‌కు ఎంతో చరిత్ర ఉందన్నారు. ఈ అసోసియేషన్ నుండి ఎంతోమంది జడ్జీలు ఎన్నికయ్యారని వారంతా మంచి హోదాల్లో పనిచేస్తున్నరని వారిలాగే నూతనంగా ఎన్నికైన జడ్జీలు పనిచేయాలని సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని మంచి తీర్పులు ఇవ్వాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.నాగభూషణం నాయుడు మాట్లాడుతూ మీరు కష్టపడి బాగా చదివి న్యాయమూర్తులుగా ఎంపిక అయినందుకు చాలా సంతోషమన్నారు. జడ్జిలుగా బాగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. బార్ కౌన్సిల్ మెంబర్ రవిగువేరా, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ చక్రపాణి, ఐలు జిల్లా అధ్యక్షులు సి.లక్ష్మన్న, బి.మురళీమోహన్, రంగరవికుమార్, చాంద్‌బాషా, మురళి మనోహర్, హేమలత, రవికుమార్, తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి డి. వెంకటస్వామి అధ్యక్షత వహించారు.



మాట్లాడుతున్న జూనియర్ జడ్జి జస్వంతి

అహింసా మార్గంలో స్వాతంత్ర్యం సాధించిన మహాత్మా గాంధీ

దళితవాడలో చీరలు పంపిణీ చేసిన డాక్టర్ శంకర శర్మ

ప్రజాశకి-కర్నూలు హాస్పిటల్

అహింసా పద్ధతిలో దేశానికి స్వాతంత్రం సాధించుకోవచ్చని నిరూపించిన ఘనత జాతిపిత మహాత్మా గాంధీజీ కే దక్కుతుందని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు నగరంలోని బుధవారం పేటలోని దళితవాడలో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ ప్రపంచంలోని చాలా దేశాల్లో హింసాత్మక పద్ధతుల్లో దేశానికి స్వాతంత్రం సాధించుకున్న సందర్భాలు ఉన్నాయని, అందుకు భిన్నంగా మహాత్మాగాంధీ శాంతియుత పద్ధతుల్లో మన దేశానికి స్వాతంత్రం సాధించారన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవించడం మన దేశంలో మహాత్మాగాంధీ వల్లే సాధ్యపడిందని కొనియాడారు. నిజం పలకడం, అహింసా విధానం అవలంబించడం వంటివి నిజమైన ఆయుధాలని గాంధీ నిరూపించారని చెప్పారు. స్వాతంత్ర సంగ్రామంలో మహాత్మాగాంధీ వినియోగించిన సత్యాగ్రహం అనే ఆయుధం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని వివరించారు. దక్షిణాఫ్రికాలో తెల్ల, నల్లజాతీయుల మధ్య జరుగుతున్న వివక్షతను రూపుమాపడంలో మహాత్మా గాంధీ ఎంతో కృషి చేశారని చెప్పారు. దక్షిణాఫ్రికా స్వాతంత్ర పోరాటంలో మహాత్మా గాంధీ పాత్ర ఎంతో కీలకంగా మారిందని చెప్పారు. దేశంలో వివక్షతను, అంటరానితరాన్ని రూపుమాపడంలో మహాత్మా గాంధీ కషి చేశారన్నారు. గాంధీ జీవితం నేటి తరం యువతకు ఆదర్శప్రాయమని వివరించారు. మహాత్మా గాంధీ అందించిన స్ఫూర్తితోనే ఆయన వర్ధంతి సందర్భంగా దళితవాడలో మహిళలకు చీరల పంపిణీ చేశామని డాక్టర్ శంకర్ శర్మ తెలిపారు. మహాత్మా గాంధీ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన చూపిన మార్గాలు మన హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయాయని చెప్పారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు.



గాంధీ వర్ధంతి రోజున చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర శర్మ



చర్చాగోష్టిలో మాట్లాడుతున్న రాయలసీమ విసి సుధీర్ ప్రేమ్‌కుమార్

వ్యవసాయ అనుబంధ రంగాల్లో ప్రగతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ రంగాల్లో ప్రగతి సాధిస్తుందని రాయలసీమ విసి సుధీర్ ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం రాయలసీమ వర్సిటీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిపై చర్చాగోష్టి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విసి సుధీర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మరో అతిథులుగా విచ్చేసిన అజీజ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ వెంకటసాయి శశిధర్, కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ లోకానందరెడ్డి, రెక్టార్ సివి కృష్ణారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రిజిస్టర్ తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు

ఎంపిఇడి సెమిస్టర్ ఫలితాలు విడుదల: వర్సిటీ పరిధిలో గత అక్టోబర్ నెలలో నిర్వహించిన ఎంపిఇడి కోర్సు 2,4 సెమిస్టర్ ఫలితాలను మంగళవారం వైస్ ఛాన్సలర్ సుధీర్ ప్రేమ్ కుమార్ విడుదల చేశారు.



రోడ్డుపై నిలిపిన ఆటో

ఎక్కడ పడితే అక్కడ ఆటోల నిలుపుదల

ఇతర వాహన దారుల రాకపోకలకు ఇబ్బందులు

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని పోలకల్, సి. బెళగల్ వంటి గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ ఆటోలను నిలుపుదల చేయడం వలన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.ఇక్కడే బస్సులకు, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఆటోలు రోడ్ల మీదే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దింపడం కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం కనిపిస్తున్నప్పటికి అధికారులు, పోలీసులు తగిన చర్యలు చేపట్టడం లేదని పలువురు వాహనదారులు పేర్కొంటున్నారు. ఆటో స్టాండ్‌లు కూడా బస్టాండ్ ఆవరణములో కనీస స్థలం లేక నిలుపుదల కోసం పాట్లు పడుతున్నారు.

సమిష్టిగా నడుద్దాం : విరుపాక్షి

ప్రజాశక్తి-ఆలూరు


సమావేశంలో మాట్లాడుతున్న విరుపాక్షి

సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు కలిసికట్టుగా నడుద్దామని వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ బి.విరుపాక్షి కోరారు. మంగళవారం చిప్పగిరి భంభం స్వామి దర్గాలో వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య అధ్యక్షతన మండల నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విరుపాక్షి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని తెలిపారు. ప్రతి ఇంట్లోనూ సంక్షేమ పథకాల లబ్ధి పొందినవారు ఉంటారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. నియోజకవర్గంలో రిజర్వాయర్లను పూర్తి చేసేందుకు పెండింగ్‌లో ఉన్న నిధులను మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో వైసిపి అభివృద్ధికి కృషి చేస్తూ సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పని చేయాలని కోరారు. సొసైటీ అధ్యక్షులు మల్లికార్జున, నాయకులు ధనుంజయ, లాలుస్వామి, ఓబులేసు, లోకనాథ్, ఎంపిటిసి లింగన్న, సుంకన్న, మల్లికార్జున, సేనాపతి, శేఖర్, నాగేంద్ర, లింగన్న పాల్గొన్నారు.

పేద విద్యార్థుల ఉన్నత చదువులకు
ఆర్‌డిటి సేవలు ఉపయోగకరం
- సర్పంచి సర్పంచి అరుణ్ కుమార్

ప్రజాశక్తి - దేవనకొండ


దాతలను సన్మానిస్తున్న సర్పంచి అరుణ్ కుమార్

పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్‌డిటి సేవలు ఎంతో ఉపయోగపడుతున్నాయని సర్పంచి ఎం.అరుణ్ కుమార్ కొనియాడారు. మంగళవారం ఆర్‌డిటి సంస్థ ఆధ్వర్యంలో తెర్నేకల్ గ్రామంలోని ఎంపియుపి పాఠశాలకు మైక్ సెట్, విద్యుత్ తీగలు అందించారు. సహకారం అందించిన మలిగేలి మాదన్న, పుండుకూర బతకన్న, ఎలక్ట్రీషన్ ఫిలోమోన్ దాతలను సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడారు. మంచి మార్కులు వచ్చిన పేద విద్యార్థులకు మెడిసిన్, ఐఐటి, జేఈఈ మెయిన్స్ వంటి ఉన్నత చదువులు చదివించేందుకు ఆర్‌డిటి కృషి చేస్తోందని తెఇపారు. అలాగే ఎస్సీ కాలనీ, రామమ్మపేటలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మురళీ ఆధ్వర్యంలో మార్కింగ్ అంచనా వేశారు. పంచాయతీ కార్యదర్శులు రాముడు, సునీత, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గోపాల్, విలేజ్ సర్వేయర్ వెంకటేష్, మాజీ ఎంపిటిసి చాప వీరన్న, వైసిపి జిల్లా కమిటీ సభ్యులు వాల్మీకి రాఘవేంద్ర, ఆర్‌డిటి అధ్యక్షులు నర్సప్ప పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం
- టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం


కార్యకర్త మృతికి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

మండలంలోని హాల్వి గ్రామానికి చెందిన బిఎం.రమేష్ కుటుంబానికి అండగా ఉంటామని టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, మాధవరం రాఘవేంద్ర రెడ్డి, టిడిపి యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు తెలిపారు. మంగళవారం టిడిపి కార్యకర్త రమేష్ మృతి చెందిన విషయం తెలుసుకొని ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. 'రా.. కదలిరా' చంద్రబాబునాయుడు పత్తికొండ బహిరంగ సభ ప్రాంగణంలో రమేష్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వైద్యం కోసం ఆస్పరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, వెంటనే మెరుగైన వైద్యం కోసం ఆదోనికి పంపించారు. ఆదోనిలోని ప్రయివేట్ మధు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి, చూడి ఉలిగయ్య, ఎన్.రామకృష్ణారెడ్డి, సురేష్ నాయుడులు మధు ఆస్పత్రికి చేరుకొని చికిత్స నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేసి పరామర్శించారు. సోమవారం ఇంకా మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు అమిలియో ఆస్పత్రికి తరలించారు. మంగళవారం చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉల్లిగయ్య, రాఘవేంద్ర రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన రమేష్ కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని తెలిపారు. రమేష్ కుటుంబానికి ఎన్.రాఘవేంద్రరెడ్డి రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

భగత్ సింగ్ యూత్ క్యాలెండర్ ఆవిష్కరణ

హాలహర్వి : మండలంలోని పచ్చారపల్లి గ్రామంలో భగత్ సింగ్ యూత్ నూతన క్యాలెండర్‌ను పచ్చారపల్లి జనార్ధన్ ఆధ్వర్యంలో టీచర్ ఉమామహేశ్వర్ చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. పచ్చారపల్లి భగత్ సింగ్ యూత్ సుధాకర్, జనార్ధన్, తిమ్మప్ప, పాండు, నరసప్ప, వన్నప్ప, సాయి, రాజశేఖర్, రంజాన్, గోపాల్, ఈశ్వరప్ప, శివ పాల్గొన్నారు.

తప్పని నిరీక్షణ...

- ఉదయం 11.16 గంటలకు ఆస్పత్రికి వస్తున్న వైద్యులు
- రోగుల అవస్థలు... - వైద్యుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం

వైద్యం కోసం రోగులకు నిరీక్షణ తప్పడం లేదు. ప్రభుత్వాస్పత్రికి వైద్యులు ఆలస్యంగా వస్తుండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన ఆ శాఖాధికారులు అటువైపు దృష్టి సారించడం లేదు. రోగులు చిన్నపాటి జబ్బుకు కూడా వేలాది రూపాయలు ఖర్చు పెట్టి ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆదోని మండలం పెద్దహరివాణం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 11.16 గంటలకు వైద్యులు ఆస్పత్రికి వస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం కోసం నాడు-నేడు కింద కార్పొరేట్ స్థాయికి వసతులు కల్పిస్తున్నట్లు నాయకులు చెబుతున్నారు. ఆచరణలో కిందిస్థాయి అధికారులు తూట్లు పొడుస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో గతంలో 30 పడకల ఆస్పత్రి ఉండేది. సరైన వసతులు లేకపోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా మార్చారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాడు-నేడు కింద సుమారు రూ.8 కోట్లతో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జనవరి 9న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24/7 సేవలు అందిస్తామని అధికారులు పేర్కొన్నారు. అప్పటి నుంచి రాత్రిపూట ఒక్క సిబ్బందితో మాత్రమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నడుస్తోంది. వైద్యులు అందుబాటులో ఉండడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామస్తులు వైద్యం కోసం ఉదయం 10 గంటలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళితే వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం ఉదయం సుమారు 20 మంది రోగులు ఆస్పత్రికి వచ్చారు. వైద్యులు లేకపోవడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 11.16 గంటలకు ఓ డాక్టర్ అందుబాటులోకి వచ్చారు. వైద్యులు సమయ పాలన పాటించకపోవడం ఏమిటని సర్పంచి రాము, వైస్ ఎంపిపి వీరేష్, గ్రామస్తులు ఆమెను నిలదీశారు. నిరంతర సేవల ద్వారా ప్రజలకు వైద్యం అందించే సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. సకాలంలో చికిత్స అందకపోవడంతో పరిస్థితి విషమించే ప్రమాదం ఉందని రోగులు ఆందోళన చెందుతున్నారు. వైద్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో రోగులకు ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని, వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉండాలని గ్రామస్తులు కోరుతున్నారు. అత్యవసర కేసులు వస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు విధులు నిర్వహించకుండా సొంత క్లినిక్‌లు పెట్టుకుని దందా చేస్తున్నారని మండిపడ్డారు. పాలకుల నిర్లక్ష్యంతోనే వైద్యులు రోగుల ప్రాణాలతో ఆటలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.


వైద్యురాలితో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు


వైద్యుల కోసం నిరీక్షిస్తున్న గ్రామస్తులు


సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ

శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలోని శ్రీమహాయోగి లక్ష్మమ్మ కోఆపరేటివ్ బ్యాంకు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న 74 మంది మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా డీఎస్పీ శివ నారాయణ స్వామి హాజరయ్యారు. బ్యాంకు బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ రాయచోటి సుబ్బయ్య మాట్లాడుతూ... శ్రీమహాయోగి లక్ష్మమ్మవ్వ బ్యాంకు ద్వారా అందించే కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు ఉపాధ్యక్షులు బి.లక్ష్మయ్య శెట్టి, డైరెక్టర్లు సుధాకర్ శెట్టి, దినకర్ పాటిల్, శ్రీనివాసులు, అశ్వత్ నారాయణ, హుస్సేన్ అహ్మద్, ఆర్ఎంజి.రెడ్డి, సుధాకర్, సురేష్ గుప్తా, బ్యాంకు మేనేజర్ జుల్ఫికర్, నసీరుద్దీన్ పటేల్, వెంకట్ లక్ష్మి, నాగమణి, నరసయ్య పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య కోర్సులపై అవగాహన

ప్రజాశక్తి - ఆదోనిరూరల్

విద్యార్థులకు వృత్తి నైపుణ్య కోర్సులపై అవగాహన కల్పించినట్లు కెజిబివి కళాశాల ప్రిన్సిపల్ శాంతి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆదోని కెజిబివి విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఇండస్ట్రియల్ క్షేత్ర సందర్శన నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఒకేషనల్, టెక్నికల్ కోర్సుల ద్వారా విద్యార్థులకు ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు త్వరగా లభిస్తాయని తెలిపారు. గత రెండేళ్ల నుంచి విద్యార్థినులకు 10వ తరగతి, 12వ తరగతి వృత్తి విద్యా కోర్సు ఉత్తీర్ణత సర్టిఫికెట్ సైతం ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం భీమా ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించారు. కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ కోర్సులను అభ్యసించడం ద్వారా భవిష్యత్తులో విద్యార్థులకు కలిగే ప్రయోజనాలపై కళాశాల యాజమాన్యం అవగాహన కల్పించిందని తెలిపారు. వృత్తి విద్య ఉపాధ్యాయులు జి.జ్యోతి, కళాశాల ఉపాధ్యాయులు అరుణశీబా, నాగరత్న, ఉమా, సురేఖ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ అంతర్ రాష్ట్ర వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. మంగళవారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో వైఎస్ఆర్ అంతర్ రాష్ట్ర వాలీబాల్ పోటీలకు జగన్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫైనల్ మ్యాచ్‌లో గెలిచిన గట్టు స్ట్రైకర్స్ జట్టుకు మొదటి బహుమతి రూ.40,116, రెండో బహుమతి చెట్నిపల్లె జట్టుకు రూ.30,116, మూడో బహుమతి కర్నూలు స్టేడియం వారికి రూ.20,116, నాలుగో బహుమతి రాయచూర్ వారికి రూ.10,116 అందజేశారు.


బహుమతులు అందిస్తున్న నాయకులు

మున్సిపల్ కార్మికులకు సంక్రాంతి కానుక రూ.1000 అందజేయాలి
- సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం జిఒ 12 ద్వారా సంక్రాంతి కానుక రూ.1000 చెల్లించాలని సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు డివిజన్ కార్యదర్శులు రాముడు, ప్రసాద్, వీరేష్, ఎపి మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు ఇస్మాయిల్, నాగరాజు, ఎల్లప్ప, ప్రతాప్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ మేనేజర్‌కు జిఒ 12తో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమ్మె సందర్భంగా మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ ఇచ్చిన హామీ మేరకు రూ.1000 సంక్రాంతి కానుకను విడుదల చేయాలని కోరారు. లక్ష్మన్న, వీరేష్, నరేష్, జయరాజు, కేశన్న, ఈరన్న, రవి, మల్లికార్జున, కిరణ్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా రవికుమార్

ప్రజాశక్తి - ఆదోని



ఆదోని సబ్ డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ఆదోనికి చెందిన ఎరుకల రవికుమార్‌ను ఎంపిక చేసినట్లు సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. రవికుమార్ మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వివక్ష, అంటరానితనం నిర్మూలన కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తన ఎంపికకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.4.15 కోట్లు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం హుండీ ఆదాయం రికార్డు స్థాయిలో రూ.4.15 కోట్లు దాటిందని శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మంత్రాలయం చేరుకున్న భక్తులు కానుకల రూపంలో హుండీలో వేశారని తెలిపారు. 33 రోజుల నెలసరి హుండీ ఆదాయం రూ.4,15,33,738 నగదు రూపంలో రాగా 44 గ్రాముల బంగారం, 3,642 గ్రాముల వెండి వచ్చినట్లు చెప్పారు.

ఎపిఒ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కోసిగి

మండల ఎపిఒగా చంద్రశేఖర్ నూతనంగా బాధ్యతలు చేపట్టారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో వైసిపి మండల ఇన్‌ఛార్జీ పి.మురళీ మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ రెడ్డి మాట్లాడారు. మండలంలో ఉపాధి కూలీల సంఖ్యను పెంచుతూ, గతంలో కంటే పనిదినాలను పెంచి ఉపాధి కల్పించాలని తెలిపారు. వలసలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తహశీల్దార్ రుద్రగౌడ్, ఆదోని క్లస్టర్ టిఎ గిడ్డయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సాయిూ.. నోరు అదుపులో పెట్టుకో
- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి అధినేత చంద్రబాబుపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సమంజసం కాదని, ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు హెచ్చరించారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అక్రమాలు, దౌర్జన్యాలు, భూకబ్జాల గురించి తెలిసినా ఎలాంటి విమర్శ చేయలేదంటే చేతకానితనం కాదని గ్రహించారని తెలిపారు. తమ అధినేత చంద్రబాబుపై స్థాయికి మించి మాట్లాడి అవమానపరిస్తే చూస్తూ ఊరుకోబోమని, అవసరమైతే ఎమ్మెల్యే చేసిన అక్రమాల బాధితులను కలిసి ప్రజలకు వివరిస్తామని హెచ్చరించారు. తమ వద్ద కూడా సైన్యం ఉందని, తాను ఆదేశిస్తే దేనికైనా తెగపడేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేయాలే తప్ప ఎప్పుడూ ఒకరిపైఒకరు విమర్శ చేసుకుంటూ ఇతరులను ఇబ్బంది పెట్టడం తమ నైజం కాదని పేర్కొన్నారు. భూ కొనుగోలులో జరిగిన అక్రమాలపై మైనార్టీ నాయకులు ఉమ్మి సలీం ఆధారాలతో ప్రెస్ మీట్ పెట్టినప్పటికీ ఎందుకు కౌంటర్ ఇవ్వలేదని ప్రశ్నించారు. కుటుంబ సభ్యులు అందులో భాగస్వాములు ఉండడంతోనే ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి నోరు మెదపలేదన్నది అందరికీ తెలుసన్నారు. నాయకులు భూపాల్ చౌదరి, అప్సర్ బాష, శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మి సలీం, బత్తిని కుబేర్‌నాథ్, సజ్జాద్, శేషిరెడ్డి, రంగస్వామి నాయుడు, కృష్ణారెడ్డి, బసవ, నాగరాజు, లక్ష్మీనారాయణ, జయరామ్, వాల్మీకి వెంకటేష్, బసాపురం రామస్వామి, వెంకటేష్ చౌదరి ఉన్నారు. అలాగే సిటీ ప్రెస్ కాంపౌండ్‌లోని టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి మాన్వి దేవేంద్రప్ప, రామచంద్ర కార్యాలయంలో బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదోనిలో జరుగుతున్న క్రికెట్ బెట్టింగ్, మట్కా, గ్యాంబ్లింగ్, భూదందాలకు కేరాఫ్‌గా మారిన ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి వ్యవహారాలపై చంద్రబాబు లేవనెత్తడం వాస్తవమేనని తెలిపారు. అవినీతి ఆరోపణలు చేయడం లేదని చెప్పారు. ఐపిఎస్ అధికారి ఆదోని డీఎస్పీగా బాధ్యతలు తీసుకున్న మరుక్షణమే ఎందుకు మార్పించారని నిలదీశారు. గ్యాంబ్లింగ్‌లో సుమారు రూ.కోటి నగదు పట్టుకున్న అప్పటి త్రీ టౌన్ సిఐ శ్రీరాములును అభినందించాల్సింది పోయి బదిలీ చేయించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. నాయకులు సోమశేఖర్ రెడ్డి, షేక్షావలీ, రాముడు, కారుమంచప్ప, గోవిందు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు


చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు


నరసింహులును పరామర్శిస్తున్న మురళీమోహన్ రెడ్డి

నరసింహులుకు మురళీ మోహన్ రెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - కోసిగి

మధుమేహ (షుగర్) వ్యాధితో బాధపడుతూ కాలివేలికి కర్నూలు ప్రయివేట్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చిన ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షులు నాడిగేని నరసింహులును మంగళవారం వైసిపి మండల ఇన్‌ఛార్జీ పి.మురళీ మోహన్ రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం కుదుటపడాలని ఆకాంక్షించారు. ఎంపిపి ఈరన్న, వైసిపి మండల అధ్యక్షులు బెట్టనగౌడ్, కామన్‌దొడ్డి నరసింహులు, బుళ్లి నరసింహులు, సోఫీ, కందుకూరు రమేష్, రామన్న, గౌస్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కోసిగి : కోసిగిలోని సజాలగుడ్డం రోడ్డులో ఉన్న శ్మశానంలో వివాహిత వడ్డే అంపమ్మ (35) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు... కౌతాళం మండలం వల్లూరు గ్రామానికి చెందిన అంపమ్మ ఆరేళ్ల క్రితం భర్త రమేష్‌ను, ముగ్గురు పిల్లలను వదిలేసి అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి కోసిగికి వచ్చి స్థిరపడ్డారు. కొన్నేళ్లుగా ఆయనతో కలిసి సహజీవనం చేశారు. ఆయనను వదిలేసి కోసిగిలోని సిద్ధప్పపాలెం వీధిలో వడ్డే రాముడుతో కలిసి సహజీవనం చేసేవారు. మూడు రోజుల క్రితం వడ్డే రాముడు బహిర్భూమికి వెళ్లి రైల్వే పట్టాల వెనుకనున్న ఉల్లిగయ్య బావి వద్ద అనుమానస్పదస్థితిలో మృతి చెందారు. వడ్డే రాముడు చనిపోయారని మనస్తాపానికి గురైన అంపమ్మ సోమవారం అర్ధరాత్రి శ్మశానంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడి అక్కడికక్కడే మృతి చెందారు. మంగళవారం ఉదయం అటుగా వెళ్తున్న స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎఎస్ఐ నాగరాజు, సిబ్బంది చంద్రశేఖర్, రామప్రతాప్‌తో కలిసి మృతదేహాన్ని పరిశీలించారు. అంపమ్మ నోటి నుంచి నరగ రావడం చూసి పురుగు మందు తాగినట్లు అనుమానం వ్యక్తం చేశారు. మృతురాలి తల్లి అమరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కుక్కల బెడదను నివారించాలి

- కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల ఆవేదన
- కౌన్సిల్ కోరం లేక అరగంట ఆలస్యంగా సమావేశం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో కుక్కల బెడదను నివారించాలని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి పన్నులు చెల్లిస్తూ డిడి తెచ్చి ఇచ్చినా అధికారులు నిర్లక్ష్యం చేసి స్వీకరించకపోతే ఎలా అని, అధికారులు ఇంత నిర్లక్ష్యంగా పనిచేస్తే ఎలా అంటూ సీనియర్ కౌన్సిలర్ నాగరత్నమ్మ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. పట్టణంలోని కౌడల్ పేటలో నివాసం ఉంటున్న సయ్యద్ హుస్సేన్ 14 ఏళ్ల క్రితం ఇంటి పన్నులను డిడి రూపంలో చెల్లించారని, అనివార్య కారణాల వల్ల పోస్టింగ్ వేయలేదని, ఆ డబ్బును తిరిగి చెల్లించేందుకు కౌన్సిల్‌లో తీర్మానం పెట్టడం విచారకరమని కౌన్సిలర్ తెలిపారు. ఇలాంటి పరిస్థితులు ఇకముందు రాకుండా చూడాలని కోరారు. పట్టణంలో ఎక్కడ చూసినా కుక్కల బెడద తీవ్రంగా ఉందని, కుక్క కాటుకు అనేకమంది గురవుతున్నారని కౌన్సిలర్ రఘునాథరెడ్డి తెలిపారు. తన వార్డులో అనేక మంది కుక్కకాటుకు గురయ్యారని వివరించారు. వైస్ ఛైర్మన్ ఎంఎంజి.గౌస్ మాట్లాడుతూ... తన భార్య కూడా కుక్క కాటు గురయ్యారని, కుక్కల బెడద మరింత తీవ్రంగా ఉందని తెలిపారు. కుక్కలను పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలించాలని, కుక్కకాటుకు గురైతే ఎలాంటి ప్రాణాపాయం జరగకుండా వాటికి ఇంజెక్షన్లు చేయాలని సూచించారు. కౌన్సిల్ సమావేశంలో కేవలం ముగ్గురు కౌన్సిలర్లు మాత్రమే మాట్లాడిన తర్వాత సమావేశం ముగిస్తున్నట్లు ఛైర్మన్ శాంత ప్రకటించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి కోరం లేకపోవడంతో అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. కౌన్సిల్ కోరం కోసం ఛైర్మన్ శాంత తన ఛాంబర్‌లోనే వేచి ఉండాల్సి వచ్చింది. కోరం సభ్యులు వచ్చిన తర్వాత అరగంట ఆలస్యంగా కౌన్సిల్ సమావేశం ప్రారంభించి అజెండా కాపీ చదివి సమావేశాన్ని ముగించారు. పట్టణంలో ఉన్న సమస్యలపై ఎవరూ చర్చించడానికి ఆసక్తి చూపకపోవడం గమనార్హం. వైస్ ఛైర్మన్ నరసింహులు, కమిషనర్ రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు నాగభూషణం రెడ్డి, గోపినాథ్ వర్మ, రాజు నాయక్, రాజశేఖర్ రెడ్డి, కృపాకర్, మెప్మా అధికారిని సెమినా బేగం, ఐసిడిఎస్ అధికారిని రాగిణి, వసంత, టిపిఒ శ్రీనివాసులు, కౌన్సిలర్లు చలపతి, లక్ష్మీదేవి, ఫయాజ్, ఉస్మాన్, ఇంతియాజ్, శాంతి, లక్ష్మి, సురేష్, సునీత పాల్గొన్నారు.


కౌన్సిల్‌లో మాట్లాడుతున్న ఛైర్మన్ శాంత

మానవత్వానికి మారుపేరు మల్లెల
- బాలుని ఆదరించిన ఆల్ఫ్రెడ్ రాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్ఫ్రెడ్ రాజ్ మరోసారి మానవత్వానికి మారుపేరుగా నిలిచారు. వివరాలిలా ఉన్నాయి... మండలంలోని కలుగొట్ల గ్రామానికి చెందిన మారెప్ప, ఇందిరమ్మ దంపతులకు ఏకైక కుమార్తె రోజా. రోజాకు ముగ్గురు కుమారులు ఉన్నారు. గత ఆరు నెలల క్రితం రోజా మూడో కుమారునికి జన్మనిచ్చారు. కొంతకాలంగా ఈమె గొంతు క్యాన్సర్‌తో బాధపడుతూ మూడు నెలల క్రితం మృతి చెందారు. మూడు నెలల బాలుడు అవ్వ, తాతల వద్ద సంరక్షణలో ఉంటున్నాడు. బాలుడు తల్లిపాలకు దూరమై ఇబ్బంది పడేవాడు. ఈ విషయాన్ని గ్రామస్తుల ద్వారా ఆల్ఫ్రెడ్ రాజు తెలుసుకొని మంగళవారం కలుగొట్ల గ్రామానికి వెళ్లారు. ఆ కుటుంబాన్ని సందర్శించి, ఆ కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చారు. ఆ బాలుని ఎదుగుదలకు అవసరమైన పౌష్టికాహారం కోసం సహాయ, సహకారాలు అందించారు. భవిష్యత్తులో ఆ బాలునికి ఏ అవసరమొచ్చినా తన సహాయ, సహకారాలు ఉంటాయని తెలిపారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల, తిమ్మప్ప, సతీష్ పాల్గొన్నారు.


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆల్ఫ్రెడ్ రాజు

జగన్‌తోనే గ్రామ స్వరాజ్యం
- ఎంపిటిసి వెంకటేష్ శెట్టి

ప్రజాశక్తి - మంత్రాలయం

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎంపిటిసి గణదాళం వెంకటేష్ శెట్టి పేర్కొన్నారు. మంగళవారం గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలను అందుబాటులోకి తెచ్చారని కొనియాడారు. వైసిపి పాలనలో రాజకీయంగా అన్ని వర్గాల ప్రజలకు అవకాశం కల్పిస్తున్నారని, ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని కోరారు. ఆర్యవైశ్యులకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి, రాంపురం రెడ్డి సోదరులు ఎల్లప్పుడూ అండగా ఉండి సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డి గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు. ఆర్యవైశ్యులు కృష్ణయ్య శెట్టి, దామోదర్ గుప్తా, బద్రినాథ్ శెట్టి, కోల్గేట్ రమేష్, రఘునాథ్ శెట్టి, వాజన్న శెట్టి, నాగయ్య శెట్టి, రమేష్ శెట్టి, విశ్వం పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదోని : ఆదోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ పార్కులోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వాస్పత్రిలో చిన్న పిల్లలకు, రోగులకు పండ్లు, నీరు అందించారు. అవోపా పట్టణ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్ గుప్తా మాట్లాడుతూ... గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అవోపా పట్టణ కార్యదర్శి మిర్యాల శ్రీధర్, సభ్యులు రఘు, రాజేష్, రాము, సనత్, విశ్వనాథ్ పాల్గొన్నారు.




ఆదోనిలో రోగులకు పండ్ల పంపిణీ చేస్తున్న సభ్యులు

దాతృత్వం చాటుకున్న విజయ్

ప్రజాశక్తి - హోళగుంద

పాఠశాలకు స్థలాన్ని ఇచ్చి విజయ్‌కుమార్ దాతృత్వం చాటుకున్నారు. మండలంలోని వందవాగిలి గ్రామ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో కన్నడ, తెలుగు 1 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులు చదువుతున్నారు. 8వ తరగతి పూర్తయిన తర్వాత విద్యార్థులందరూ మధ్యలోనే బడి మానేస్తున్నారు. వందవాగిలి గ్రామంలో హైస్కూల్ ఏర్పాటుకు స్థలం లేకపోవడంతో గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది సంతేకుడ్లూరు గ్రామానికి నాగలికర విజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని విజయ్ కుమార్ హై స్కూల్ కోసం రెండెకరాల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. మంగళవారం విజయ్‌కుమార్‌ను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు సన్మానించారు.


స్థల దాతను సన్మానిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు





గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పిస్తున్న జెసి, డిఆర్ఒ

అప్రజాస్వామిక విధానాలను వ్యతిరేకించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - ఆత్మకూరు

కోటీశ్వరులకు ఊడిగం చేస్తూ పేద, మధ్య తరగతి ప్రజానీకంతోపాటు వ్యాపార వర్గాలను సైతం సమస్యలతో ముంచెత్తుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అప్రజాస్వామిక విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. పోరాటమే ఆయుధంగా రానున్న ఎన్నికలలో బిజెపిని, ఈ పార్టీకి వత్తాసు పలికే వైసిపిని, టిడిపిని, జనసేన పార్టీలను ఓడించాలని కోరారు. మంగళవారం పట్టణంలోని డాక్టర్ ఏ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో సిపిఎం పట్టణ కమిటీ జనరల్ బాడీ సమావేశం పట్టణ సీనియర్ నాయకులు ఎం.రజాక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తుందని అన్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా మతం పేరుతో చీల్చే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. మోడీ అధికారంలోకి వచ్చిన ఎనిమిది సంవత్సరాల కాలంలో దేశంలో మహిళలపై హత్యలు, అత్యాచారాలు, నిరుద్యోగం, మత ఘర్షణలు, ప్రజలపై పన్నుల భారాలు విపరీతంగా పెరిగాయన్నరు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు మాత్రం తగ్గించి వ్యవసాయం దివాలా తీసే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. కేంద్రం ఏం పని చేసినా అన్ని సమర్థిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విపరీతంగా పన్నుల భారం మోపుతుందని అన్నారు. రాష్ట్రంలో నవరత్నాలు తప్ప మరో రత్నం ప్రభుత్వానికి కనబడటం లేదని విమర్శించారు. అభివద్ధి శూన్యంగా ఉందన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు, ప్రజలపైన వేస్తున్న ఆర్థిక భారాలకు వ్యతిరేకంగా, కార్మిక, కర్షక హక్కుల కోసం, ప్రజలందరికీ మెరుగైన విద్య, వైద్యం, మౌలిక వసతుల కోసం సమరశీలంగా ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఏసురత్నం, సీనియర్ నాయకులు ఏ.రాజశేఖర్, పట్టణ కార్యదర్శి ఏ.రణధీర్, సురేంద్ర, ఇస్మాయిల్, డి.రామ్ నాయక్, ఎన్.స్వాములు, దినేష్, నాయకులు పుల్లమ్మ బాయ్, అక్కమ్మ, ఏ.సువర్ణమ్మ, లక్ష్మిదేవి, వీరన్న, టి.శివ కుమార్, కిరణ్, పాల శివుడు, మహమ్మద్, గణపతి, రఫి, రైట్ బాష తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ మార్గంలో నడవాలి

- జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి
- జిల్లా వ్యాప్తంగా జాతిపిత వర్ధంతి కార్యక్రమాలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జాతిపిత మహాత్మా గాంధీజీ సిద్ధాంతాలను అనుసరించి, ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ సిద్ధాంతాలను అనుసరిస్తూ ఆయన చూపిన అహింసా వాద మార్గంలో నడవాలన్నారు. స్వాతంత్ర సాధన కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయ వ్యక్తి అని కొనియాడారు. స్వేచ్ఛ వాయువులతో జాతి అభివృద్ధి చెందాలని మహాత్మా గాంధీ చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ మననం చేసుకోవాలని అన్నారు. స్వాతంత్రం కోసం ప్రజలందరినీ చైతన్య పరచడంలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. సమాజ హితం కోరుతూ ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు. అంతకుముందు మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా రెండు నిమిషాల పాటు అందరూ మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి బి.పుల్లయ్య, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసులు, అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు. **గాంధీ చౌక్‌లో... :** నంద్యాల పట్టణంలోని గాంధీచౌక్‌లో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్సీ ఇసాక్ భాషా, ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ షేక్ మాబున్నిసా తదితరులు నివాళ్లు అరించారు. అలాగే జడ్‌పిటిసి గోపవరం గోకుల్ కృష్ణారెడ్డి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **మిగతా 6వ పేజీలో...**

రక్షణ చట్టాలను పటిష్టం చేయాలి

- ఐఎంఎ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ - కోవిడ్ అమర వైద్యుల దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్రంలో వైద్యుల రక్షణ చట్టాలను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ పేర్కొన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా నిర్వహించే జాతీయ అమరవీరుల దినోత్సవంలో భాగంగా ఈ సంవత్సరం జాతీయ ఐఎంఏ పిలుపుమేరకు నంద్యాలలో కోవిడ్ అమర వైద్యుల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. స్థానిక మధుమణి ఆసుపత్రి సమావేశ భవనంలో ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ వసుధ రాణి, డాక్టర్ పనిల్ కుమార్‌ల నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని జాతిపిత చిత్రపటానికి పూలమాల వేసి కొవ్వొత్తులు వెలిగించి కోవిడ్ అమర వైద్యులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ కోవిడ్ విపత్కర పరిస్థితులలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి వైద్యులు లక్షలాది ప్రజల ప్రాణాలు కాపాడిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సేవలందించే క్రమంలో భాగంగా దేశంలో రెండు వేల మంది, మన రాష్ట్రంలో 122 మంది వైద్యులు తమ ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నవంబర్లో రాష్ట్ర ఐఎంఏకు ఇచ్చిన హామీ మేరకు వైద్యులు, ఆసుపత్రుల రాష్ట్ర రక్షణ చట్టంలో సవరణలు చేసి కఠిన తరం చేయాలని, తదనుగుణంగా బిల్లును రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు మధుసూదనరావు, ఐఎంఏ కోశాధికారి డాక్టర్ మధుసూదన్ రెడ్డి, వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జఫరుల్లా, వైద్యులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిలో భాగంగా జాతీయ అమరవీరుల దినోత్సవం, కోవిడ్ అమర వైద్యుల దినోత్సవం నిర్వహించారు. స్థానిక కళారాధన, వికలాంగుల సంఘం, లయన్స్ క్లబ్ కార్యాలయంలో నంద్యాల క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పీవీ సుధాకర్ రెడ్డి, సోమేశుల నాగరాజుల నిర్వహణలో జరిగిన ఈ ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు కశెట్టి చంద్రశేఖర్, ఆంజనేయులు గుప్తా, ఎంపీ వి రమణయ్య, సాయి సందీప్, కళారాధన సభ్యులు పాత్రికేయులు పసుపులేటి జనార్ధన్, నటుడు శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గాంధీజీ చిత్రపటానికి, కోవిడ్ అమర వైద్యుల చిత్రపటాలకు నివాళ్లులర్పిస్తున్న ఐఎంఏ సభ్యులు, వైద్యులు

బాబు పాలనలో అన్నీ స్కామ్‌లే..

- రాబోయే రోజుల్లో చంద్రబాబు జైలుకెళ్లడం ఖాయం
- ఆళ్లగడ్డ ప్రాంతాన్ని గంగుల కుటుంబం ఎంతో అభివృద్ధి చేసింది
- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా - ఇండోర్ స్టేడియం ప్రారంభం



ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభిస్తున్న పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నాడు చంద్రబాబు పాలనలో స్కీమ్‌లు లేవని, అన్నీ స్కామ్‌లే ఉన్నాయని రాష్ట్ర పర్యాటక, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. చంద్రబాబు అనేక కేసుల్లో ఇరుక్కున్నారని రాబోయే రోజుల్లో జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. మంగళవారం ఆళ్లగడ్డ పట్టణంలోని ఎద్దుల పాపమ్మ కళాశాల మైదానంలో నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి ఆర్కే రోజా, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి రోజా మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే సాధ్యమన్నారు. ప్రజల్ని నిర్లక్ష్యం చేసి వారి మధ్యలో లేని ప్రజాప్రతినిధులను సిఎం పక్కన పెడుతున్నారని తెలిపారు. ఆళ్లగడ్డలో ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. తనను ఆహ్వానించిన గంగుల కుటుంబానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ప్రజలకు సేవ చేయాలన్న తలంపుతోనే ముఖ్యమంత్రి పదవులు ఇచ్చారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకున్న వారికి మరోసారి అవకాశం ఇస్తున్నారన్నారు. గంగుల కుటుంబం ఆళ్లగడ్డ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేసిందని, ఎమ్మెల్యే గంగుల నానిని మీరు ఆదరించాలన్నారు. ఎన్నికలు వస్తున్నాయని సంక్రాంతి పండుగకు డూడూ బసవన్నలు వచ్చినట్లు ప్రతిపక్షాల వారు వస్తున్నారని, వారికి ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన లేదని, వారిని తరిమికొట్టాలని ప్రజలకు సూచించారు. ఇప్పటిదాకా ముగ్గురు కృష్ణులు వచ్చారని, ప్రస్తుతం నాలుగో కృష్ణుడు వస్తున్నారన్నారు. 2014లో చంద్రబాబు గెలవడంతో రాష్ట్ర అభివృద్ధి కుంటు పడిందన్నారు. అనంతరం శాప్ చైర్మన్, రాష్ట్ర వైసిపి యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ తాను చాలామంది రాజకీయ నాయకులతో తిరిగానని, గంగుల కుటుంబంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. నాతో మాట్లాడేందుకు జిల్లా రాజకీయ నాయకులు భయపడతారని, మీ ఎమ్మెల్యే గంగుల నాని దగ్గర ఎంతో ప్రేమ దొరికిందన్నారు. ఇండోర్ స్టేడియం పూర్తి అయ్యేంత వరకు నిద్రలేని రాత్రులను నాకు ఆయన చూపించారన్నారు. పట్టుబట్టి ఇండోర్ స్టేడియాన్ని రెండు నెలల్లో పూర్తి చేశారన్నారు. మంచి మేనిఫెస్టోతో ముఖ్యమంత్రి జగన్ మరో పది రోజుల్లో మన ముందుకు వస్తారని, మంచి చేసిన వారికి ఓటు వేయాలన్నారు. గంగుల నానిని గెలిపించాలన్నారు. ఎమ్మెల్యే గంగుల నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడమే ప్రధాన లక్ష్యమన్నారు. చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో తాను డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశామని, ఇండోర్ స్టేడియాన్ని ఈరోజు ప్రారంభించుకున్నామన్నారు. ఫైనల్ మ్యాచ్ ఇండోర్ స్టేడియంలోనే జరుగుతుందన్నారు. రెండు నెలల్లో స్టేడియం పూర్తి అయ్యిందని, చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉండి కూడా స్థానిక టిడిపి నాయకులు స్టేడియాన్ని ఏర్పాటు చేయలేకపోయారని, కేవలం భూమి పూజకే పరిమితమయ్యారన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో నెల వ్యవధిలోనే రూ. 29 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించామన్నారు. నియోజకవర్గంలో మంచి జరిగిందంటేనే ఓటు వేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో బ్రిజేంద్రారెడ్డిని తిరిగి ఆశీర్వదించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, ఉమ్మడి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నాయక్ దిల్షాద్ ముజఫర్ హుస్సేన్, రాష్ట్ర మైనార్టీ ప్రభుత్వ సలహాదారుడు హబీబుల్లా, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, జడ్పిటిసి రాచంరెడ్డి లక్ష్మీదేవి, రాచంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, ఆర్డిఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, ఎంపిపిలు గజ్జల రాఘవేంద్రారెడ్డి, అమర్నాథ్ రెడ్డి, తహసీల్దార్‌లు హరినాధరావు, రవీంద్ర ప్రసాద్, ఎంపిడిఒలు మహబూబ్ ఖాన్, సుబ్బారెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు నాయబ్ రసూల్, మాదం మరియమ్మ, ఎంవిఎం రాజు, కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు, ముస్లిం నాయకులు షేక్ ఆజాద్, నజీర్, ఆమీర్ భాష తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి



పోస్టర్లను విడుదల చేస్తున్న గ్రామీణ వైద్యులు

చలో విజయవాడ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - అవుకు

ఫిబ్రవరి 4న విజయవాడలో జరిగే గ్రామీణ వైద్యుల మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ చలో విజయవాడ పోస్టర్లను మంగళవారం గ్రామీణ వైద్యుల కార్యాలయంలో గ్రామీణ వైద్యుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రొక్కం నాగేశ్వర్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని గ్రామీణ వైద్యుల సంఘాలను బలోపేతం చేసి భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామీణ వైద్యుల సమస్యలను చర్చించి ప్రభుత్వం దష్టికి తీసుకు వెళ్లేందుకు ఈ సభను ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ వైద్యుల బలాన్ని ఈ సభ ద్వారా వివిధ పార్టీలకు తెలియజేసి భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. మండలంలోని గ్రామీణ వైద్యులు భారీగా తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు, ఉపాధ్యక్షుడు బాలుడు మండల నాయకులు జయరాముడు, జిలానీ, షేక్ నఫీజ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నల్లవాగులపల్లెకు చేరిన ఉత్సవ పల్లకి

- ముగిసిన మొదటి విడత పారువేట మహోత్సవం

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండలంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి పారువేట మహోత్సవం మంగళవారం మొదటి విడత ముగిసింది. మళ్లీ మండలంలో ఫిబ్రవరి 15వ తేదీ గురువారం రాత్రి మందలూరు గ్రామం నుండి రెండో విడత పారువేట మహోత్సవం ప్రారంభమవుతుంది. ముందుగా మండలంలోని నల్లవాగుపల్లె గ్రామంలో పల్లకిలో కొలువుదీరిన ఉత్సవమూర్తులకు భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తిరుణాల వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏఎస్ఐ బాలన్న బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఉత్సవ పల్లకీలోకి స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఇబాదత్ ఖాన ప్రారంభం

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని అవుకు మెట్ట వద్ద కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 35 లక్షలతో నూతనంగా నిర్మించిన ఇబాదత్ ఖానాను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, సతీమణి కాటసాని జయమ్మ, కుమారుడు కాటసాని ఓబుల్ రెడ్డిలు మంగళవారం ప్రారంభించారు. షియా ముస్లిం మైనారిటీలు ప్రార్థనలు చేసుకునేందుకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సొంత నిధులతో కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇబాదత్ ఖానాను నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పట్టణంలో, నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బనగానపల్లె నవాబ్ వంశీయులు మీర్ ఫజల్ అలీ ఖాన్, వైసిపి నియోజకవర్గ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి, ముస్లిం మత పెద్దలు జానాబ్ రియాజ్ అలీ, జానాబ్ అమీర్ హుస్సేన్, జానాబ్ అబేద్ హుస్సేన్, షేక్ ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు డాక్టర్ మహ్మద్ హుస్సేన్, అబ్దుల్ ఫైజ్, సయ్యద్ సజ్జాత్ హుస్సేన్, సైకిల్ షాప్ మహబూబ్ వలి, నూకల వెంకట సుబ్బయ్య, ముస్లిములు పాల్గొన్నారు.



ఇబాదత్ ఖానను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన సతీమణి కాటసాని జయమ్మ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

సుప్రీం తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

సుప్రీంకోర్టు తీర్పు జగన్ రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు అని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడుపై పెట్టిన అక్రమ ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో జగన్ రెడ్డి ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిందన్నారు. చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందని తెలిపారు. అధికార గర్వంతో జగన్ రెడ్డి అండ్ కో పెట్టిన కేసులు తప్పుడివని సుప్రీంకోర్టు తీర్పుతో వెల్లడైందన్నారు. సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యాలకు ఇప్పటికైన జగన్ రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గుపడాలన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను 'రా.. కదలిరా..' ద్వారా చంద్రబాబు నాయుడు ఎత్తి చూపిస్తున్నారని, నెలరోజుల పాటు అవిశ్రాంతంగా జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నిసున్నారని తెలిపారు.

రాబోయే ఎన్నికల్లో భూమా కిషోర్ రెడ్డికే మద్దతు

- విజయ మిల్క్ డైరీ మాజీ చైర్మన్ భూమా నారాయణ రెడ్డి - ఆళ్లగడ్డ నుంచి పోటీ చేస్తా : భూమా కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రానున్న ఎన్నికల్లో మా కుటుంబం మద్దతు భూమా కిషోర్ రెడ్డికే అని విజయ మిల్క్ డైరీ మాజీ చైర్మన్ భూమా నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం భూమా కిషోర్ రెడ్డి స్వగృహంలో భూమా కుటుంబ సభ్యులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కుటుంబ సభ్యులంతా కలిసి భూమా కిషోర్ రెడ్డిని గెలిపించుకునే బాధ్యత తీసుకుంటామన్నారు. భూమా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో భూమా కుటుంబం ఎలా వెళ్లాలో నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఆళ్లగడ్డ ప్రజలకు కూడా కన్ఫ్యూజన్‌గా ఉందని, రాబోయే ఎన్నికల్లో భూమా కుటుంబం అంతా తన వెంటే ఉంటారని, వారి మద్దతు తనకే అని స్పష్టం చేశారు. అఖిలప్రియ వ్యవహార శైలితోనే భూమా కుటుంబం పరువు దిగజారిందని ఆరోపించారు. 2019లో తాను భూమా కుటుంబ సభ్యులందరితో మాట్లాడే బిజెపిలో చేరానన్నారు. నాటి నుండి ఆళ్లగడ్డ తాలూకాలో బిజెపిని బలోపేతం చేశామన్నారు. ఫిబ్రవరి 5 లేదా 7వ తేదీ నుండి ఆళ్లగడ్డ నుంచి బిజెపి తరపున ప్రచారం చేస్తామన్నారు. పొత్తులనేది పార్టీ నిర్ణయమన్నారు. భూమా అఖిలప్రియ వెంట క్యాడర్ ఎవరు లేరన్నారు. పొత్తులో భాగంగా తనకు సీటు రాకపోయినా ఆళ్లగడ్డ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానన్నారు. ఏదేమైనా భూమా కుటుంబ వారసుడిని తానేనని, మద్దూరి అఖిలప్రియ, భార్గవ రామ్‌తో సంబంధం లేదన్నారు. భూమా నాగిరెడ్డి చెల్లెలు దేవి, మహేశ్వరి, వీరభద్ర రెడ్డి, భూమా మహేశ్వర్ రెడ్డిలు మాట్లాడుతూ భూమా కిషోర్ రెడ్డి కే తమ పూర్తి మద్దతు అన్నారు. ఆయన ఏ పార్టీ నుండి పోటీ చేసిన మద్దతు ఉంటుందన్నారు. భూమా కుటుంబ అల్లుడు కాటసాని రఘునాథరెడ్డి తాను పంపిన వీడియోలో మాట్లాడుతూ భూమా కిషోర్ రెడ్డికి తన పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.



భూమా కిషోర్ రెడ్డితో కలిసి మాట్లాడుతున్న భూమా కుటుంబ సభ్యులు

'బాల అకాడమీ'లో అమరవీరుల దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలలోని పార్క్ రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో మంగళవారం అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా పాఠశాల కరెస్పాండెంట్ ఎంజివి.రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత మాట్లాడారు. జాతిపిత మహాత్మా గాంధీ అహింస, సత్యాగ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు అందించిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ శిల్ప కళ భేష్ : మంత్రి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ శిల్పకళ భేష్ అని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీ శారద శిల్పకళా మందిరాన్ని మంత్రి ఆర్కే రోజా రాష్ట్ర జల వనరుల శాఖ సలహా మండలి సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల నానిలతో కలిసి సందర్శించి శిల్పాలను పరిశీలించారు. శారద శిల్పకళా మందిరం వద్దకు మంత్రి రోజా చేరుకోగానే ప్రముఖ శిల్పి దురుగడ్డ రవీంద్ర చారి, కుమార్తె భువనేశ్వరి, సతీమణి సావిత్రమ్మలు బొకేలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం శిల్పకళా మందిరంలోని శిల్పాలను ఆమె తిలకించారు.

అహోబిలేసుని దర్శించుకున్న మంత్రి : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామిని మంత్రి ఆర్కే రోజా దర్శించుకుని పూజలు చేశారు. ముందుగా ఎగువ అహోబిలం చేరుకోగానే ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర జల వనరుల శాఖ సలహా మండలి సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల నానిలతో కలిసి ఆలయంలో స్వయంభుగా వెలసిన నరసింహస్వామిని దర్శించుకున్నారు. దిగువ అహోబిలంలో కొలువుతీరిన ప్రహ్లాద వరద స్వామి, అమృతవల్లి అమ్మవారి లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ వారిని ఆశీర్వదించి నవ నరసింహుల చిత్రపటాలను అందజేశారు.



బౌద్ధుని శిల్పాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఆర్కే రోజా



మంత్రికి బొకే అందజేస్తున్న శారద శిల్పకళా మందిరం నిర్వాహకులు



మంత్రిని సన్మానిస్తున్న నేతలు

ఎస్‌సి, ఎస్‌టి సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా తిక్క వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల పట్టణం దుర్గాపేట కాలనీ వాసి అయిన తిక్క వెంకటేశ్వర్లు ఎస్సీ, ఎస్టీ సెల్ జిల్లా కమిటీ సభ్యుడుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గల రాజేంద్రనాథ్ రెడ్డిని ఎస్సీ ఎస్టీ సెల్ మోడలింగ్ కమిటీ సభ్యులు తిక్క వెంకటేశ్వర్లు మిత్రబృందం మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల గజమాలతో సత్కరించారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ అప్పజెప్పిన బాధ్యతలను మనస్సాక్షిగా సేవా దృక్పథంతో సమన్యాయం చేయడానికి సాధ్యమైనంత వరకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలం ఎంపీపీ బుగ్గన నాగభూషణ్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, గూని నాగరాజు, మధు, బొద్దుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గౌండా లాలాను పరామర్శించిన బిసి రాజారెడ్డి



గౌండలాలాను పరామర్శిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఈద్గానగర్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు గౌండా లాలాను మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి మంగళవారం పరామర్శించారు. లాలా ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న బిసి రాజారెడ్డి ఇంటి వద్దకు వెళ్లి గౌండా లాలాను పరామ ర్శించారు. ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకుని విశ్రాంతి తీసుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, టిడిపి ముస్లిం మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు రాయలసీమ సలాం, నాయకులు రఫీ హమ్మద్ హుసేన్, కార్యకర్తలు పాల్గొన్నారు.



నృత్యం ప్రదర్శన చేస్తున్న దృశ్యం

శ్రీశైలంలో నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య కళారాధన కార్యక్రమం లో భాగంగా సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని మంగళవారం నాడు నిర్వహించారు. దేవస్థానం భక్తుల కోసం నిర్వహించే నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన రాగ రమ్య కల్చరల్ ఆర్గనైజేషన్ వారిచే సంప్రదాయం నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని క్షేత్రంలోని దక్షిణ మాడవీధులో నిత్య కళారాధన వేదికపై సాయంత్రం భరత నాట్య నృత్య ప్రదర్శనను దేవస్థానం ఏర్పాటు చేసింది.



మాట్లాడుతున్న డాక్టర్ బాబు

కుష్టు రహిత సమాజాన్ని నిర్మిద్దాం : సర్పంచి


ప్రజాశక్తి - రుద్రవరం

కుష్టు వ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దామని గ్రామ సర్పంచ్ శాంతకుమారి, వైద్యాధికారి బాబు తెలిపారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మండలంలోని నరసాపురం గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించి కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కలెక్టర్ సందేశం వివరించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బాబు మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేని రాగి రంగు గల మచ్చలు, కళ్ళు మూసుకోలేకపోవడం కాళ్లలో చెప్పులు జారిపోవడం,చల్లని వేడి వస్తువుల తేడా తెలియకపోవడం చేతి నుండి వస్తువులు జారిపోవడం చెవి రెమ్మలు మందంగా మారిపోవడం కాళ్ళ లేదా చేతుల కండరాలలో బలహీనత వంటి తదితర లక్షణాలు ఉన్నట్లయితే నిర్లక్ష్యం చేయకుండా వైద్య సిబ్బందిని సంప్రదించి చికిత్సలు చేయించుకోవాలని వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే వైద్యుల సలహా మేరకు మందులు వాడాలన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల ఎలాంటి వివక్ష చూపనని కుష్టు రహిత సమాజంగా చేయుటకు నా వంతు కృషి చేస్తానని ప్రజలతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి ప్రభాకర్ వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యూజెఎఫ్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గడివేముల

ఎపి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్–2024 నూతన డైరీని గడివేముల మండల పోలీస్ స్టేషన్ నందు మంగళవారం ఏఎస్ఐ వెంకటేశ్వర్లు ఆవిష్కరిం చారు. ఏఎస్ఐ మాట్లడుతూ నిజాలు నిర్భయంగా రాసి ప్రజలను చైతన్యం చేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చిన్న రామాంజనేయులు, పాణ్యం నియోజకవర్గ కార్యదర్శి నీలం సత్యనారాయణ, నాయకులు ఎల్లా సుబ్బయ్య, మహబూబ్ బాషా, ఇబ్రహీం, చెన్నయ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న పోలీసులు తదితరులు

నేడు లెనిన్ శత వర్ధంతి సభ

జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - పగిడ్యాల

ఈనెల 31న విప్లవ నిర్మాత లెనిన్ శత వర్ధంతిని జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు పి పక్కిర్ సాహెబ్, టి గోపాలకృష్ణ సిపిఎం కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రం పగిడ్యాలలో సిపిఎం నాయకురాలు గంధం హుస్సేనమ్మ అధ్యక్షతన సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విప్లవ నిర్మాత లెనిన్ శత వర్ధంతి నందికొట్కూరులోని వైష్ణవి జూనియర్ కళాశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. 1917లో లెనిన్ నాయకత్వ ంలో సోషలిస్ట్ విప్లవం జరిగిందన్నారు. జార్ చక్రవర్తుల నిరంకుశతపాలన అంతం చేయడం జరిగిందన్నారు. రష్యాలో కార్మికుల కర్షకుల శ్రమజీవుల రాజ్యం ఏర్పడిందని దోపిడి పీడత పేదరికం పూర్తిగా నిర్మూలన జరిగిందన్నారు. సోషలిజాన్ని చాటి చెప్పడానికి రష్యాలో విద్యా రంగంలో ఇతర రంగాలలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మన దేశానికి స్వతంత్రం వచ్చి దాదాపు 76 సంవత్సరాలు పూర్తయినప్పటికీ పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగ సమస్య పెచ్చురిల్లిపోతోందన్నారు. ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు తొత్తులుగా పనిచేస్తున్నాయని మండిపడ్డారు. దేశంలో పేదరిక నిర్మూలన, నిరక్షరాస్యత, నిరుద్యోగ సమస్యలను నిర్మూలించాలంటే మహి ళలు, యువకులు, విద్యార్థులు సోషలిస్టు విప్లవం తీసుకొచ్చి ప్రజా ఉద్యమ ంలో చేయాలన్నారు. విప్లవ నిర్మాత లెనిన్ శత



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు పక్కిర్ సాహెబ్

వర్ధంతికి అత్యధిక సంఖ్యలో యువకులు, విద్యార్థులు మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, లక్ష్మన్న, నరసింహ, రమేష్, రాజేష్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



మిని మేనిఫెస్టోను వివరిస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

'సుప్రీం' తీర్పు వైసిపికి చెంపపెట్టు

- ధర్మవరం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-డోన్

బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం డోన్ మండలం, కనపకుంట గ్రామంలో డోన్ మండల టిడిపి అధ్యక్షులు సలీంద్ర శ్రీనివాసులు యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి హాజరయ్యారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పై పెట్టిన అక్రమ కేసుల్లో ఒకటైన ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో వైసిపి రెడ్డి ప్రభుత్వానికి ఎదురు దెబ్బ తగిలిందని, చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందన్నారు. మా నాయకుడిని ఇబ్బంది పెట్టాలని చూస్తున్న జగన్ రెడ్డి ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తీర్పు ఒక చెంపపెట్టు అని అన్నారు. రా కదలిరా బహిరంగ సభకు వస్తున్న ప్రజానీకాన్ని చూస్తే ప్రజల మద్దతు ఎవరికి ఉందో అర్థమౌతుందని అన్నారు. టిడిపికి 5కోట్ల ప్రజలే స్టార్ క్యాంపైనర్లని అన్నారు. తెలుగుదేశంపార్టీకి పట్టం కట్టడానికి ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని అన్నారు. డోన్ నియోజకవర్గ టిడిపి సలహాదారుల కమిటీ అధ్యక్షులు మురళీకృష్ణ గౌడ్, మన్నే వెంకటరమణ రెడ్డి, మండలం టిడిపి ప్రధాన కార్యదర్శి ఎల్ఐసి శ్రీరాములు, యూనిట్ ఇంచార్జ్ కమలాపురం రమేష్ పాల్గొన్నారు. కనపకుంట గ్రామ నాయకులు, సింగిల్ విండో డైరెక్టర్ మధు సూదన్ రెడ్డి, గోవిందరెడ్డి, మైసూరా రెడ్డి, నరసింహా రెడ్డి, సుబ్బా రాయుడు, గోవిందరెడ్డి, సూరి,ఘన మద్దయ్య, మద్దిలేటి ఉన్నారు.

వైసిపికి ఒక్క ఛాన్స్‌తో మోసపోయాం

- మాజీ ఎమ్మెల్యే బుడ్డా



ఐక్యతను ప్రకటిస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా , టిడిపి నాయకులు

ప్రజాశక్తి - వెలుగోడు

వైసిపికి ఒక్క ఛాన్స్ ఇచ్చి మోసపోయామని ఇక నైనా అన్ని కులాల ప్రజలు మేల్కోండని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళ వారం వెలుగోడు రోఖీయబి దర్గా వద్ద జయహో బిసి సభలో ఆయన మాట్లాడారు. ఎంతో అభివృద్ధి చేసిన తనను 38 వేల ఓట్లతో ప్రజలు ఓడించారని, ఎంతో అభివృద్ధి చేస్తాడనుకున్న ఎమ్మెల్యే ఏమి అభివృద్ధి చేశారో ఇప్పుడు అర్థమయ్యిందన్నారు. ఎమ్మెల్యే శిల్పా రొఖీయాబీ మాత దర్గాకు, వెలుగోడు జామియా మసీదుకు వస్తాయన్న రూ.2 కోట్లు ఇంతవరకు రాలేదన్నారు. జగన్ రాక్షస పాలనలో అందరు బాధితులే అయ్యారని అన్నారు. రైతులు, అన్ని రకాల వ్యాపారస్తులు, కూలీలు, ప్రజలు మార్పు కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నారపు శేషిరెడ్డి, లాయర్ సిద్ధిఖ్, ఖలీలుల్లా ఖాన్, హిదాయత్ అలి ఖాన్, మోమిన్ రసూల్, డాక్టర్ జాకీర్, జనసేన షాలు బాషా, అమీర్ హంజా, మాజీ సర్పంచ్ కలాం, మల్లెల రాజశేఖర్, వడ్డే తిరుపాలు బాబు రాష్ట్ర బిసి కోఆర్డినేటర్, రాష్ట్ర కార్య దర్శి జిల్లెల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వైసిపితో రాష్ట్రం నాశనం

రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గిత్త జయ సూర్య

ప్రజాశక్తి - కొత్తపల్లి

రాష్ట్రం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని నాశనం చేశాడని, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గిత్త జయ సూర్య తెలిపారు. మంగళ వారం మండలంలోని ఎర్రమఠం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం మండల టిడిపి కన్వీనర్ నారపురెడ్డి ఆధ్వర్యంలో నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి నందికొట్కూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ గౌరు వెంకటరెడ్డి ఆదేశాల మేరకు భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మానిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్రానికి ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా



టిడిపి మేనిఫెస్టో మహిళలకు వివరిస్తున్న నాయకులు

ఇష్టారాజ్యాంగ పాలన కొనసాగిస్తురన్నారు. టిడిపి విజయానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచే యాలన్నారు. రానున్న రోజుల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. నందికొట్కూరు నియోజకవర్గం టిడిపి హాయంలోనే అభివృద్ధి చెందిందని ప్రస్తుతం ఎక్కడ ఎలాంటి అభివృద్ధి జరగలేదని తెలిపారు. మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ లింగస్వామి గౌడ్, పరమేశ్వర రెడ్డి, శీలం లింగన్న, వెంకటస్వామి, చెంద్రశేఖర్ రెడ్డి, జెహురుళ్ళ, వెంకట రెడ్డి, బుచ్చిరెడ్డి, శివారెడ్డి, రాజు, రమణారెడ్డి, రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డోన్ అభివృద్ధికి చర్యలు : చైర్మన్

ప్రజాశక్తి-డోన్

డోన్ అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. డోన్ మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిల్ సమావేశంలో 14 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ముఖ్యంగా ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సూచనల మేరకు కలెక్టర్ , మెజిస్ట్రేట్ , చైర్మన్ నంద్యాల జిల్లా వారి సూచనల మేరకు డిఎఫ్ఎంటి గ్రాంట్‌లో రూ. 62 లక్షల డోన్ మున్సిపాలిటీకి కేటాయించారు. పట్టణంలో ఒకటో వార్డు నుంచి 32 వార్డు వరకు గల వీధిలలో రహదారులపై ఏర్పడిన గుంతలను , పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలను ప్రజలు , వాహనదారులు సదురు గుంతలపై వెళ్లేటప్పుడు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నందున సిసి ప్యాచ్,బీటీ బ్యాచ్ కొరకు రూ.5 లక్షలు మున్సిపల్ నిధి నుంచి కేటాయించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంకాంట్రాక్ట్ , ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు సంబంధించి మున్సిపాలిటీలో పనిచేస్తున్న ప్రతి ఒక్క మున్సిపల్ వర్కర్‌కు రూ.వెయ్యి మున్సిపల్ సాధారణ నిధుల నుండి చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది అమలు చేయడం,నూతనంగా ఏర్పాటు



మాట్లాడుతున్న చైర్మన్ సప్తశైల రాజేష్

చేసిన కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రిజర్వేషన్ పాటిస్తూ అక్కడ మార్కెట్ విలువ ఆధారంగా నిర్ణయించిన చదరపు అడుగుల ధర ప్రకారం 12 నెలల గుడ్‌విల్ మొత్తం వసూలు చేయుటకు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, డిఇ రసూల్ , ఎఇ సురేష్ ,శానిటేషన్, రెవిన్యూ , హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.



గాంధీకి చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెల్సీ తదితరులు



●విగ్రహానికి నివాళులర్పిస్తున్న జడ్పిటిసి గోకుల కృష్ణారెడ్డి తదితరులు



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



నివాళులర్పిస్తున్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

గాంధీజీ మార్గంలో నడవాలి

5వ పేజీ తరువాయి.. కార్యక్రమంలో నాయకులు అమరనాథ్ రెడ్డి, హుస్సేన్ రెడ్డి, దస్తగిరి, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల :** నంద్యాల పట్టణంలోని నంది రైతు సమాఖ్య కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం నంది రైతు సమాఖ్య ఉపాధ్యక్షుడు బి.రామసుబ్బారెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సమాఖ్య గౌరవ సలహాదారు కె.రవీంద్రనాథ్ హాజరై గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, నాగరాజరావు, ఓబులపతి, పుల్లారెడ్డి, తూము శివారెడ్డి, బాలచంద్రుడు, లక్ష్మయ్య, రైతులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహానికి టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర కలిగిన బ్రిటిష్ వారిని గడగడలాడించి వారి కబంధహస్తాల నుంచి అహింసామార్గం ద్వారా దేశానికి స్వాతంత్రం తీసుకువచ్చిన మహానుభావుడు మహాత్మా గాంధీ అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బింగుమల్ల సుబ్రహ్మణ్యం శెట్టి, వీరాపురం బత్తుల భాస్కర్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది నాగేంద్ర రెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షులు మల్లారెడ్డి, యాగంటి పల్లె మల్లేశ్వర్ రెడ్డి, దస్తగిరి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె రూరల్ :** బనగానపల్లె పట్టణంలో మహాత్మాగాంధీ 76వ వర్ధంతి వేడుకలు పట్టణ ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, మహిళ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య భవనంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి శ్రీరామ వెంకట సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షురాలు గుండా సుప్రజ, మహిళా సంఘం అధ్యక్షురాలు స్వర్ణలత, యువజన సంఘం అధ్యక్షుడు గుండా మురళీధర్, వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి ఊరేగింపుగా బయలుదేరి కొత్త బస్టాండ్ వద్ద డివైడర్‌పై నూతనంగా ప్రతిష్ఠించిన గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు గుండా శ్రీనివాసులు, గుండా రవికుమార్, కేటపల్లె శివ చంద్రయ్య, నల్లగట్ల వెంకటేశ్వర్లు, నూకల విజయకుమార్, సుబ్బసత్యనారాయణ, బింగమల్ల హనుమాన్ కుమార్ బచ్చు రమేష్, నల్లగట్ల శివయ్య, జక్క సుబ్రహ్మణ్యం, స్వర్ణలత, విజయకుమారి, శోభాదేవి, శశికళ, అపర్ణ పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, టౌన్ ప్రసిడెంట్ మన్సూర్ అహ్మద్, ఉమ్మడి కర్నూలు జిల్లాల వైఎస్ఆర్పిపి మైనారిటీ సెల్ రీజినల్ కో ఆరినేటర్ అబుబక్కర్, కౌన్సిలర్ వీరబోమ్మ రూపాదేవి, వీరబొమ్మ శ్రీను, జబ్బార్, గ్రంది కృష్ణమూర్తి, అల్వాల రాంమూర్తి, నాగేశ్వరరావు,డాక్టర్అల్వాల నవీన్,నాగేశ్వరరావు, లాయర్ సత్యనారాయణ, శ్రీనివాసులు,కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, గపార్,జిల్లా నాయకులు ఉస్మాన్ బేగ్, రమేష్,రామకృష్ణ, చింతా విజ్జి, కిరణ్, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **డోన్ :** మహాత్మా గాంధీ 'వర్ధంతి' సందర్భంగా డోన్ పట్టణంలో తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి , రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యదర్శి వలసల రామకృష్ణ, టిడిపి నాయకులతో కలిసి మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు, డోన్ మండలం టిడిపి అధ్యక్షులు సలీంద్ర శ్రీనివాసులు,గండికోట రామ సుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ వర్ధంతిని అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్న సందర్భంగా... దేశం కోసం మహోన్నత త్యాగాలు చేసిన దేశభక్తులను స్మరించుకుందామన్నారు. మంచికి మద్దతు పలుకుతూ టిడిపి అధికారంలోకి రావడానికి మన వంతు కృషి చేయడమే జాతిపితకు మనమిచ్చే అసలైన, ఘనమైన నివాళి అని అన్నారు. **డోన్ పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో** ప్రధానో పాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన గాంధీ 76వ వర్ధంతి సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. సీనియర్ ఉపాధ్యాయులు లక్ష్మయ్య మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యానికి పునాది హిందూ ముస్లిం ఐక్యతని గాంధీజీ చాటాడన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు శివప్రసాద్ సుబ్బారెడ్డి, వెంకటరమణ, వెంకట లక్ష్మీ, రాధ,రవిశేఖర్, అనంత శ్రీనివాసులు, అల్లిపీరా, రఘునాథ్, ఎస్తేరమ్మ, లక్ష్మీకాంతరెడ్డి, భూకాంతరెడ్డి, మద్దిలేటి, సుబ్బరాయుడు, మధుసూదన్ రెడ్డి, విజయకుమార్, సుభాన్, శ్రీనివాసులు, జయసుబ్బరాయుడు, శివన్న, బాబు, ఆదినారాయణ, సురేష్, లీలావతమ్మ, సంజీవరెడ్డి, రమేష్, దేవేంద్రప్ప, భాను ప్రకాష్ రెడ్డి, భారతి, లక్ష్మీ ప్రభావతి, హుస్సేన్ భాను, మునిరాజు, ప్రసాద్ రావు, మహేష్, అల్లిపీరా, తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** మహాత్మా గాంధీ సేవలు చిరస్మరణీయమని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు కందగడ్డల మోహన్ రావు అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం, వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్షుడు సుబ్బయ్య గుప్తా, వనిత క్లబ్ ఫౌండర్ విజయలక్ష్మి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వెంకటరమణ ,కోశాధికారి మధు సురేంద్ర ,వనిత క్లబ్ అధ్యక్షురాలు సుభాషిని, కార్యదర్శి ఇందుమతి, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** టీడీపీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రామ్మోహన్ యాదవ్ ప్యాపిలి పాత బస్టాండ్ ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాగేంద్ర,కోదండ రామ యాదవ్, చంద్రశేఖర్, కుంభగిరి స్వామి పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి



బేతంచెర్ల : ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో..



ప్యాపిలి : గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న టిడిపి నేతలు

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - రుద్రవరం

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అమర్నాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం చిత్రేనిపల్లె గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ 456 వివిధ రోగాలకు వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. గర్భవతులకు, బాలింతలకు సూచనలు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివాణి (గైనకాలజిస్ట్), డాక్టర్ ప్రియదర్శిని (జనరల్ మెడిసిన్), ఎంపీ హెచ్ఈఓ సుబ్బ రాయుడు, ఎమ్ పిహెచ్ ఎస్ బాలస్వామి (మేల్), ఎంపిహెచ్ఎస్ (ఫిమేల్) మల్లేశ్వరి, హెచ్ ఈ రత్నాలు, ఫీల్డ్ స్టాఫ్,ఆశా వర్కర్ లు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి చేరిక

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని కడమల కాల్వ గ్రామంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైరి ఓంకార్, మద్దిగారి బలరాముడు, మద్దిగారి మధు భూపాల్, ఇతర కుటుంబాలతో కలిసి శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో పనిచేసి వారి విజయానికోసం కృషి చేసిన బైరి ఓంకార్ ఆంధ్ర ప్రదేశ్ ట్రైబల్ ఫెడరేషన్ అధ్యక్షుడు వారి వద్ద తమ సామాజిక వర్గానికి తమకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగడంలేదని విసుగు చెంది తెలుగుదేశం పార్టీలో చేరారన్నారు. గ్రామానికి చెందిన స్టార్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేష్ గ్రామంలో ఐదు కులాలకు కలిసి ఉన్న ఒక్క స్మశానం రెండు సెంట్లు మాత్రమే ఉంది కబ్జా చేయడం జరిగిందని తమకు స్మశానాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా అభ్యర్థించారు. గ్రామానికి దాదాపు రెండు కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు ఇవ్వడం జరిగిందని ఆయకట్టు రోడ్లు సిసి రోడ్లు తాము నిర్మించినవేనని ఈ సమస్యను రాబోయే తమ ప్రభుత్వంలో నెరవేరు స్తామనిబుడ్డా రాజశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు. రాబోయే తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో సూపర్ సిక్స్ మేనిఫెస్టోలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం మహిళలకు పెద్దపీట వేయడం జరుగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ తెలుగు యువత శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షుడు మల్లేశ్వర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బైరెడ్డి సుబ్బారెడ్డి, పిట్టం రామకృష్ణారెడ్డి, మాజీ సింగల్ విండో చైర్మన్ కంచర్ల మనోహర్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు, పెట్రోల్ బంక్ కృష్ణారెడ్డి, లక్ష్మిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.



టిడిపిలోకి చేరిన నాయకులు

'ఆడుదాం-ఆంధ్ర'లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

'ఆడుదాం–ఆంధ్ర' క్రీడా పోటీలలో నందికొట్కూరు నియోజకవర్గం స్థాయి క్రీడలలో పట్టణానికి చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపల్ షేక్షావలి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ షటిల్ బ్యాడ్మింటన్ నందు అయేషా సిద్దిక, డబుల్స్ విభాగంలో గౌసియా, కబడ్డీ పోటీలు నందు ప్రమోద్ కుమార్ విశేష ప్రతిభ కనబరిచి ట్రోఫీనీ, నగదు బహుమతులను పొందారని తెలిపారు. రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో పాల్గొని కళాశాలకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వన్నూరు వలి, ఫిజికల్ డైరెక్టర్ రియాజుద్దీన్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

మహారాజ శ్రీ నంద్యాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఓ.యస్.నెం.131/2021

1. నీరెద్దుల శుష్మ
2. నీరెద్దుల శుభశ్రీ అలియాస్ సుధశ్రీ. ...వాదులు

-Vs-

1. ఆదమ్మ
2. ముల్లపూడి వెంకటేశ్వర్లు. ...ప్రతివాదులు

రెండవ ప్రతివాదికి దావా సమన్లు

ఆదమ్మ భర్త తెలియదు, తల్లి సుజాత,
వయస్సు 30 సంవత్సరాలు,
ఇంటి.నెం. 2–35, రామాలయం వీధి,
రైతునగర్, నంద్యాల టౌన్, కర్నూలు జిల్లా.

పై నంబరు దావాలో వాదులు, షెడ్యులు నందు తెలిపిన ఆస్తి యందు భాగము కావాలని కోరుతూ మీపైన దావా దాఖలు చేసినారు. ఇందులో రెండవ ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 23–02–2024 వ తేది ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానింప బడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా :23-02-2024

డి.నరేంద్ర రెడ్డి,
వాది పరం అడ్వకేటు,
కర్నూలు.